క్లుప్తంగా

శాకంబరీ అలంకారంలో మహంకాళి అమ్మవారు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి యున్న మహంకాళి అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిన వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆషాఢ మాసం మూడవ ఆదివారం సందర్భంగా మహంకాళి అమ్మవారు ధరువు రూపంలో శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డులో నివాసముండే తానికొండ క్రీస్తుదాసు గత వారం నుంచి అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి మృతుని మట్టి ఖర్చులనిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నివాస గృహాలకు పట్టాలు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్: సీఆర్‌డీఏ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం తమకు వద్దని, తాము నివాసముంటున్న స్థలాలకు పట్టాలు ఇప్పించాలని రైల్వేస్థలాల్లో నివాసముంటున్న వారు కోరుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రాంతంలో పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, నాయకులు గాదె సుబ్బారెడ్డి, కొట్టె కరుణాకరరావు, సోలా ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

తాడేపల్లిరూరల్: మంగళగిరి కమిషనరేట్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల దరఖాస్తు గడువును పొడగించినట్లు ఎస్‌ఈబీ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) మంగళగిరి కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలైన పి.ఆర్.ఓ. (పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) 1 పోస్టు, టెక్నికల్ అసోసియేట్ (1పోస్టు) లకు దరఖాస్తును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు 18-42 సం''ల లోపు అర్హులైన వారు htt p://rebap.in/notification/phpవెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఆలయ సంస్కృతికి ఆద్యుడు విఖనస మహర్షి



మంగళగిరి: ఆలయ సంస్కృతికి ఆద్యుడు విఖనస మహర్షి అని వైఖానస సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని లక్ష్మీ నృసింహస్వామి సన్నిధి వద్దల శ్రీ వైఖానస గౌతమ యోగానంద ఆశ్రమంలో వైఖానస ఆగమ ఆలయ పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఆగమ పండితులు, వైఖానస సంఘాల ప్రతినిధులు హాజరై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. వైఖానస ఆగమ వైశిష్ట్యం ద్వారా సనాతన ధర్మాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

చేనేత వ్యాపారులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



మంగళగిరి: ధర్మవరం చేనేత వ్యాపారులను నిర్బంధించి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మవరం వ్యాపారుల నుంచి దుస్తులు తీసుకుని డబ్బులు చెల్లించకపోగా తిరిగి వారిపై దాడికి పాల్పడటం అమానుషమన్నారు. చేనేత వ్యాపారులు గిరి రాజా శశి, కోటం ఆనంద్‌లను విజయవాడ ఆలయ సిల్క్స్ యజమాని గుప్తా అమానుషంగా దాడి చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. నేతన్నలపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు కుమ్మరి క్రాంతికుమార్, కాగితాల స్వాతి, ఉడతా శ్రీనివాస్, ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు దుర్గంధం..నేడు నందనవనం

- మారనున్న డంపింగ్ యార్డు
- స్థానికులకు తప్పిన ముప్పు.. అనారోగ్య సమస్యలకు ఇక చెక్
- పూర్తయిన చెత్త తొలగింపు.. మరో నెలరోజుల్లో అందుబాటులోకి రానున్న ఉద్యానవనం
- నిడమర్రు రోడ్డుకు మహర్దశ



చెత్త తొలగింపు అనంతరం డంపింగ్ యార్డు

మంగళగిరి: నిడమర్రు రోడ్డులో వెళ్లాలంటే రైల్వే గేటు పడిదంటే డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్గంధం, పొగ తట్టుకోలేక ప్రయాణికులు తల్లడిల్లిపోయేవారు. మంగళగిరి మున్సిపాల్టీగా అవతరించిన సమయంలో ఊరికి దూరంగా ఉందని నిడమర్రు రైల్వే గేటు పక్కన నాలుగు ఎకరాల స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. పట్టణం విస్తరిస్తుండడం, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో పట్టణం రైల్వే గేటు వరకు విస్తరించింది. రోజుకు 40 మెట్రిక్ టన్నులపైగా చెత్త వస్తుండడంతో డంపింగ్ యార్డు నిండిపోయింది. దీంతో యార్డు నుంచి వచ్చే దుర్గంధంతో వేసవి కాలంలో యార్డు తగలబడి పొగ చూరుతుండడంతో చుట్టుపక్కల నివాసాల వాళ్లు అనారోగ్యాల పాలు కావడమే కాక కనీసం భోజనం చేయలేని పరిస్థితి నెలకొంది. అంతేకాక మంగళగిరి నుంచి నిడమర్రు మీదుగా ప్రయాణించే వాహనాలు రైలు గేటు దగ్గర ఆగాల్సి వస్తే యార్డు నుంచి వచ్చే దుర్వాసనను తట్టుకోలేకపోయేవారు.

నెలరోజుల్లో పార్కు పనులు ప్రారంభం..

ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న డంపింగ్ యార్డును తరలించాలని ప్రజలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. అయితే గత పాలకులు మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక చొరవ తీసుకుని డంపింగ్ యార్డులోని చెత్త తరలించి అదే ప్రాంతంలో ఉద్యానవనం నిర్మించాలని అధికారులను కోరారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన అధికారులు డంపింగ్ యార్డులోని చెత్తను రోజులలోనే తరలించి ప్రక్రియ పూర్తి చేశారు. మరో నెలరోజులలో యార్డు ప్రాంతంలో ఉద్యానవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డంపింగ్ యార్డులోని చెత్త తరలింపుతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు అదే ప్రాంతం ఉద్యానవనంగా మారనుండడంతో మరింత సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

కీలకంగా మారనున్న నిడమర్రు

డంపింగ్ యార్డు తరలింపుతో నిడమర్రు రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే రైల్వే గేటు నుంచి పెదపరిమి వరకు 16 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో వైపు చినకాకాని నుంచి కృష్ణా జిల్లా గొల్లపూడి వెళ్లే జాతీయరహదారి నిడమర్రు రోడ్డు మీదుగా వెళ్తుండగా అండర్ పాస్ నిర్మాణం కొనసాగుతుంది. నిడమర్రు రోడ్డు విస్తరణతో పాటు జాతీయరహదారిని కలుపుతూ వెళ్తుండడం రానున్న రోజులలో నగరానికి నిడమర్రు రోడ్డు ప్రధానంగా మారనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు రూ.95 కోట్లతో నిడమర్రు రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రతిపాదనలు పూర్తయి టెండర్ ప్రక్రియ కొనసాగుతుంది. డంపింగ్ యార్డు తొలగింపు, రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం, రైల్వే గేటు నుంచి పెదపరిమి వరకు రోడ్డు విస్తరణ, జాతీయరహదారి వెళ్తుండడంతో రాబోయే రోజుల్లో నిడమర్రుకు మహర్దశ పట్టనుందనడంలో సందేహం లేదు.


కార్మెల్‌మాత జెండా ప్రతిష్ట మహోత్సవం



జెండాల వద్ద ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో కార్మెల్‌మాత పండుగను పురస్కరించుకొని ముందుగా కొండపై జెండాప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే బాల ఏసుదేవాలయం వద్ద విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, సహాయవిచారణ గురువులు రాజారపు అనిల్‌కుమార్, వైకుంఠపురం విచారణ గురువు తుమ్మా కరుణాకర్, ఆత్మకూరు విచారణ గురువు ఉన్నం కిరణ్‌లు దివ్యపూజాబలి నిర్వహించారు. ఈసందర్భంగా పి.బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ మహిమగల వరాలనిచ్చే తల్లి కార్మెల్‌మాత అని చెప్పారు. ఈనెల 14,15,16 తేదీలలో కార్మెల్‌మాత ఆలయ శతవార్షికోత్సవ ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా పండుగను క్రైస్తవులకు తెలియజేస్తూ అందుకు సూచనగా జెండాలను కొండపైనున్న ఆలయంవద్ద ఎగురవేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. జెండాలను చేతబూని గ్రామంలో ఊరేగిస్తు కొండపైనున్న కార్మెల్ మాత ఆలయం వద్ద వాటిని ప్రతిష్ఠించారు. విచారణ గురువులు, సహాయ విచారణ గురువులు, మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, సోడాలిటీ సభ్యులు, బాల ఏసు యువత, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ఆషాఢ సారె



శాకంబరి అలంకారంలో వాసవీమాత,



సారె తీసుకువచ్చిన మహిళలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆషాఢబహుళ సప్తమిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు వి.రాజేంద్రశర్మ వాసవీమాతకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి శాకంబరీదేవిగా అలంకరించారు. వాసవీ అష్టోత్తర, లలితా సహస్రనామాలతో విశేషపూజలు చేశారు. వాసవీ మాతను తమ ఆడపడుచుగా భావించిన మహిళలు పలురకాల తీపిపదార్థాలు, గాజులు, పసుపు, కుంకుమ, గంధం, నూతనవస్త్రాలతో కూడిన సారెను తీసుకొచ్చారు. పూజఅనంతరం గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ దాచేపల్లి నరేంద్రకుమార్, గుగ్గిళం మధు, కొత్తమాసు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

యర్రబాలెం చెరువు కట్ట పనులు ప్రారంభం



చెరువుకు గ్రావెల్‌తో కట్ట నిర్మాణం

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెం నుంచి ప్రజల ప్రాణాలకు రక్షణకు ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు ఎమ్మెల్యే ఆళ్లరామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ తీసుకుని గ్రావెల్‌తో కట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నుంచి సచివాలయానికి వెళ్లే దారి కావడంతో ఇటీవల వాహనాల రద్దీ పెరిగింది. దీంతో చెరువుకు అనేక మలుపులు ఉండడంతో కొన్నిసార్లు వాహనాలు వేగంగా రావడంతో చెరువు మలుపులో వాహనాలను అదుపు చేయలేక చెరువులోకి దూసుకెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. గత నెల రోజుల కాలంలోనే ఒక కారు, ఒక ద్విచక్రవాహనం దూసుకెళ్లగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన ఘటన చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి వెంటనే చెరువు వద్ద ప్రమాదాలు జరక్కుండా కట్ట నిర్మించాలని సూచించారు. వెంటనే స్పందించిన అధికారులు రూ.25లక్షలతో గ్రావెల్ పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి చినకాకానిలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి అమరారెడ్డి నగర్ యానాది కాలనీకి చెందిన దూదేకుల హబీబుల్లా తన ద్విచక్ర వాహనంపై ఈనెల 8వ తేదీ శనివారం కార్పొరేషన్ పరిధి చినకాకాని వై.జంక్షన్ వద్ద గల మిత్రా దాబాకు వచ్చాడు. భోజనం చేసి బయటకు వచ్చే సరికి తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. తన బైక్ మాయంపై ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీ భీమేష్



మంగళగిరి: బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన పంచుమర్తి లక్ష్మీ భీమేష్ నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నర్సరావుపేటలో జరిగిన కార్యక్రమంలో నియామకపు ఉత్తర్వుల కాపీని అందజేసినట్లు లక్ష్మీ భీమేష్ ఆదివారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కమిటీలు వేసి గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బీసీ సంఘాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో గుంటూరు జిల్లా వేదికగా పదివేల మందితో బీసీ గర్జన నిర్వహిస్తామని తెలిపారు.

కాపు విశ్రాంత ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న కాపు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాటి కృష్ణారావు

మంగళగిరి: కాపు రిటైర్డు ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని కాపు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాటి కృష్ణారావు నాయుడు అన్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరులో ఆదివారం కాపు రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కృష్ణారావు నాయుడు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు సమస్యలు వచ్చినప్పుడు తోటి రిటైర్డు ఉద్యోగులంతా వారికి అండగా నిలబడాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు చర్చించుకునేందుకు ఓ కార్యాలయం కావాలని, త్వరలోనే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను కలసి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అసోసియేషన్‌లో కాపు రిటైర్డు ఎంప్లాయీస్ సుమారు వంద మందికి పైగా ఉన్నారని, ఇంకా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం చేస్తూ రిటైర్ అయిన కాపు ఉద్యోగులు అసోసియేషన్‌లో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.హరినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తోట సాంబశివరావు, కార్యదర్శి ఇ.నారాయణ, ప్రతినిధులు గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, వై.గోవింద్, కె.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌లో ఈనెల జన్మదినోత్సవం జరుపుకోనున్న 13 మంది రిటైర్డు ఎంప్లాయీస్‌ను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఇతరులకు సేవచేస్తే భగవంతుడు ఆనందిస్తాడు

మాతా శివానంద సరస్వతి



మాతా శివానంద సరస్వతితో రోటరీ క్లబ్ సభ్యులు

తాడేపల్లిరూరల్: ఇతరులకు సేవచేస్తే భగవంతుడు సంతోషిస్తాడని మాతా శివానంద సరస్వతి అన్నారు. ఆదివారం నులకపేటలోని ఓ ప్రైవేటు హోటల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నులకపేటలోని చైతన్య తపోవన్ సంస్థాపకులు మాతా శివానంద సరస్వతి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవ చేస్తే భగవంతుడు సంతోషిస్తాడని, అటువంటి వాళ్లకు చక్కటి సంతోషం, శాంతి, విజయం చేకూరుతుందని అన్నారు. భగవంతుడు మనకు ఇచ్చిన జీవితంలో కొంత భాగం ఇతరుల సేవ కోసం వినియోగించాలని, అటువంటి సేవ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారు ముందంజలో ఉన్నారన్నారు. అనంతరం రోటరీ ప్రతినిధులు మాతాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షుడు అందె రేవంత్, కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరి, పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, త్రిపురమల్లు సతీష్‌బాబు, డైరెక్టర్లు పారేపల్లి నిరంజన్ గుప్తా, తుల్లిమిల్లి రామకృష్ణ, జొన్నాదుల బిక్షారావు, ఎస్.ధనలక్ష్మి, ఒట్టు వెంకటేశ్వరరావు, అందే మురళీమోహన్‌రావు, శ్రీభాష్యం రంగనాథ్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డి, కోశాధికారి గోపు నాగరాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు వైఎస్సార్ స్మారక పురస్కారం



తెనాలి: వైఎస్సార్ జీవితం - వ్యక్తిత్వం'పై ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన వచన కవితల పోటీల్లో పట్టణానికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు వైఎస్సార్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన తెలుగు దిన పత్రిక 'పున్నమి' నిర్వహించిన ఈ పోటీలకు 'చిరస్మరణీయుడు వైఎస్సార్' అనే కవితను పంపారు నాగేశ్వరరావు. ఉత్తమ తెలుగు వచన కవితను రాసి వైఎస్సార్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారంటూ పున్నమి సంపాదకుడు తనకు పురస్కార పత్రాన్ని పంపినట్టు ఆళ్ల ఆదివారం తెలియజేశారు. గుంటూరు-2 డిపోలో ఆర్టీసీ కండక్టరుగా చేస్తున్న నాగేశ్వరరావు, ప్రవృత్తిగా సాహితీ రచనలు చేస్తున్నారు. వివిధ అవార్డులను అందుకున్నారు.

పేదలకు నిత్యావసరాలు అందజేత



పేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న పార్టీ నాయకులు

మంగళగిరి: నగరంలోని పలువురు నిరుపేదలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నిత్యావసర సరుకులు అందజేశారు. పాత మంగళగిరికి చెందిన కనపర్తి సరోజనమ్మ, కొల్లిపార్వతి, కొంకా శివపార్వతి, మేకల నాగమ్మ కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే పంపించిన నిత్యావసర సరుకులను పార్టీ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మహిళా నాయకురాలు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, యువజన నాయకులు ఆకురాతి రాజేష్, దేశమాల ప్రభాకర్, మాతంగి బాబు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత..

మంగళగిరి: నగరంలో పాతమంగళగిరికి చెందిన రాయపూడి రాణి అనారోగ్యం, పేదరికంతో ఇబ్బంది పడుతుండడంతో మందుల కొనుగోలుకు ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా చావలి మరియమ్మ ప్రమాదానికి గురై చికిత్స చేయించుకోలేకపోతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించగా ఇరువురికి పార్టీ నాయకులు వారి నివాసాలకు వెళ్లి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. పార్టీ నాయకులు మునగా మల్లేశ్వరరావు, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, మహ్మద్ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ఏడుగురు అరెస్ట్



మోతడకలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో వేరు వేరు ప్రాంతాల్లో తాడేపల్లి పోలీసులు కోడిపందేల స్థావరాలపై దాడిచేసి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పెనుమాక మామిడితోట సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దాడిచేశామని, అక్కడ ఒక కోడిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా మహానాడు కృష్ణానది ఒడ్డున కోడి పందేలు వేస్తున్నారన్న సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకునివారి వద్ద నుంచి రూ.3600 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా డోలాస్‌నగర్‌లో కొండ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేశామని ఈ దాడిలో నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశామని, వారి వద్ద నుంచి రూ.3500 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మోతడకలో...

తాడికొండ: తాడికొండ మండలం మోతడక గ్రామ కొండల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 2 వ్యక్తులతో పాటు 9 బైక్‌లు, రూ.2510 నగదు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

శాఖమూరులో పేకాట రాయుళ్లు..

తుళ్లూరు మండలం శాఖమూరు గ్రామంలో పేకాట స్థావరాలపై పోలీసుల దాడిచేసి 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్దనుంచి రూ.1070 నగదు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు.

కల్యాణ మండపానికి నిధులు మంజూరు

పట్నంబజారు: కొల్లిపర మండలంలోని చక్రాయపాలెంలో కల్యాణ మండప నిర్మాణానికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి నిధులు మంజూరు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు గుంటూరు కృష్ణ నగర్‌లోని ఎంపీ నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. కల్యాణ మండపం నిర్మాణం నిధుల కొరత కారణంగా నిలిచి పోయిందని ఎంపీ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 31 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయించారు. గ్రానైట్ వేయడానికి రూ. 9లక్షలు కలిపి మొత్తం రూ. 40 లక్షలు అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో చక్రాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చందు నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, బూరెల దుర్గాప్రసాద్, అత్తోట మండల నాయకులు కఠారి ప్రసాద్, పసుపులేటి రమేష్, చందు కోటయ్య, చందు హరిబాబు పాల్గొన్నారు.

పాస్టర్లకు బియ్యం పంపిణీ



పాస్టర్లకు బియ్యం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జం సాయి ప్రసాద్

తాడికొండ: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం తాడికొండలో వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో 48 మంది పాస్టర్లకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత దివంగత ముఖ్యమంత్రి పేదల కోసం అహర్నిశలు పరితపించేవాడని, రూపాయి డాక్టర్‌గా పేదలకు వైద్యం అందించిన ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత అందని ద్రాక్షగా మారిన వైద్యాన్ని ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు చేరువ చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తండ్రిబాటలో నడుస్తున్న తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రానున్న ఎన్నికల్లో 175 సీట్లు సాధించి భారీ విజయం సాధించడం ఖాయమన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం 200 మంది పారిశుధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, వలంటీర్‌లకు జడ్పీ చైర్మన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్ కుమార్‌ల చేతుల మీదుగా బియ్యం పంపిణీ చేయగా ఆదివారం 48 మంది పాస్టర్లకు 25 కేజీల చొప్పున బియ్యం బస్తాలు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు షేక్ నూర్జహాన్, మాతంగి మాధవ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ఎదగటానికి చదువే ఉత్తమ సాధనం

తెనాలి: జీవితంలో రాణించాలంటే చదువే ఉత్తమ సాధనమని ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ స్పష్టం చేశారు. అకడమిక్ విద్యతోపాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవాలని సూచించారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలు, ఉపకార వేతనాలు, 209 మందికి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. క్విజ్ పోటీల్లో మొదటి మూడు స్థానాలను సాధించిన గ్రూపులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరించారు. సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథి భారత ప్రభుత్వ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ (సైంటిస్ట్-డి) నలుమోలు సుబ్రహ్మణ్యం (న్యూఢిల్లీ) మాట్లాడుతూ నిరుపేద కుటుంబ నుంచి వచ్చిన తాను, ఈ స్థాయికి రావటంలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కృషి ఉందన్నారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన కాటాబత్తుల సవ్యశ్రీ, చింపిరి, జక్కా యశ్వంత్ కుమార్‌ను బంగారు పతకాలతో సత్కరించారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు రూ.3 వేల నగదుతో మెడల్స్‌ను ఇచ్చి సన్మానించారు.